సాక్షి ఖమ్మం

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



.. బ్యాగ్‌లెస్ డే!

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీనెల నాలుగో శనివారం 'బ్యాగ్ లెస్ డే' అమలుచేయాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. IIలో



పదవీకాలం పొడిగింపు

డీసీసీబీతో పాటు పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. IIలో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం

జిల్లా అంతటా శుక్రవారం వర్షం కురిసే అవకాశముంది. చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షపాతం నమోదవుతుంది.

న్యూస్‌రీల్

రేపు నాస్తిక అధ్యయన తరగతులు

ఖమ్మంమయూరిసెంటర్: నాస్తిక సమాజం (తెలంగాణ – ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యాన శనివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నాస్తిక అధ్యయన తరగతులు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ చార్వాక సుధాకర్ తెలిపారు. సరైన ఆలోచన, తాత్విక జీవనం కోసం మనుషులు స్వేచ్ఛగా, స్వతహాగా ఆలోచించేలా అవగాహన కల్పించడమే ఈ తరగతుల ఉద్దేశమని వెల్లడించారు. ఖమ్మంలో గురువారం ఆయన మాట్లాడుతూ జీవితంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకునేందుకు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ తరగతుల్లో రిటైర్డ్ ప్రొఫెసర్లు సీహెచ్.రమేష్‌బాబు, డాక్టర్ కె.విజయ్‌కుమార్, డాక్టర్ బి.వి.రాఘవులు పలు అంశాలపై మాట్లాడతారని సుధాకర్ వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు ఆవుల అశోక్, సీహెచ్.రమేష్‌బాబు, నాగరాజు, సమతా శ్రీధర్, సత్యనారాయణ, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాలకు అనుగుణంగా ప్రశ్నాపత్రాలు



మాట్లాడుతున్న డీఈఓ నాగపద్మజ

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల స్థాయి, విద్యా సామర్థ్యాల ఆధారంగా ప్రశ్నాపత్రాలు తయారీ జరగాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.నాగపద్మజ తెలిపారు. ఖమ్మం రోటరీనగర్ హైస్కూల్‌లో జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ఆధ్వర్యాన గురువారం ఎస్‌ఏ–1 ప్రశ్నాపత్రం తయారీపై ఉపాధ్యాయులకు వర్క్‌షాపు ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నాపత్రం చూడగానే ఆందోళన చెందకుండా ఉత్సాహంగా జవాబులు రాసేలా ఉండాలని తెలిపారు. ఇక్కడ తయారుచేసే ప్రశ్నాపత్రాలు ఇతర జిల్లాలకు ఆదర్శంగా ఉండేలా, విద్యార్థుల సామర్థ్యాల సరిగ్గా అంచనా వేసేలా రూపొందించాలని సూచించారు. డీసీఈబీ సెక్రటరీ కనపర్తి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం తుంగతుర్తి సుబ్బారావు, ఏఎంఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ట్రెజరీ డీడీగా సత్యనారాయణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీడీ

ఖమ్మం సహకారనగర్: మహబూబాబాద్ జిల్లా ఖజానా శాఖాధికారి వెంటపల్లి సత్యనారాయణకు ఖమ్మం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు అందిన ఆదేశాలతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్నాళ్లు డీడీగా ఉన్న ప్రసన్నకుమార్ వైరా ఏటీఓగా నియమించారు. కాగా, డీడీ సత్యనారాయణకు ఏటీఓలు రాంబాబు, జి.శ్రీనివాస్, ఎస్‌టీఓలు మోదుగు వేలాద్రి, నాగేంద్రకుమారి, శారద, ఉద్యోగులు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

టోల్ రుసుముకు వార్షిక పాస్



ఖమ్మం అర్బన్: వాహనదారులకు జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఆఫర్ ప్రకటించింది. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నూతన టోల్ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. ఈమేరకు గురువారం అర్ధరాత్రి(శుక్రవారం) నుంచి రూ.3వేల వార్షిక రుసుంతో 200టోల్ ప్రవేశాలకు అనుమతులు లభిస్తాయని ఎన్‌హెచ్‌ఏఐ ఖమ్మం పీడీ దివ్య తెలిపారు. ఫాస్ట్‌ట్యాగ్‌లో ఆక్టివేట్ చేసిన వార్షిక పాస్‌తో జాతీయ రహదారి, జాతీయ ఎక్స్‌ప్రెస్ వేల్లోని ప్లాజాల మీదుగా ఒక ఏడాది లేదా 200 ట్రిప్పుల రాకపోకలకు అనుమతి ఉంటుందని వెల్లడించారు.

డౌన్‌లోడ్ ఇలా...

వార్షిక పాస్‌ను వాహనదారులు రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ వెబ్‌సైట్‌లో యాక్టివేట్ చేయించుకోవచ్చు. సంబంధిత ఫాస్ట్‌టాగ్ ధృవీకరణ అనంతరం ఆమోదం లభిస్తుంది. రుసుము చెల్లించిన రెండు గంటల్లోగా అమల్లోకి వస్తుందని పీడీ తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఫాస్ట్‌ట్యాగ్‌తోనే రూ.3వేలు చెల్లించి యాక్టివేషన్ చేసుకునే వెసలుబాటు ఉందని వెల్లడించారు.

సంస్కరణలతోనే సర్వతోముఖాభివృద్ధి

- యువతలో దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించాలి
- కొత్త ఆలోచనలు, నైపుణ్యాభివృద్ధి అవసరం
- దేశంపై బాధ్యత, నిజాయితీ, అంకితభావం తప్పనిసరి

'వందేళ్ల భారతం'పై 'సాక్షి టాక్ షో'లో విద్యార్థుల మనోగతం





'సాక్షి' టాక్ షోలో పాల్గొన్న ధన్వంతరి ఫార్మసీ కళాశాల విద్యార్థులు

సుజాతనగర్: దేశం నేడు(శుక్రవారం) 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటోంది. 2047 నాటికి స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో అనేక రంగాల అభివృద్ధిలో దేశం 2047 నాటికి ఎలా ఉండాలన్న అంశంపై సుజాతనగర్‌లోని ధన్వంతరి ఫార్మా కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యాన టాక్ షో నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు.

సంస్కరణలే కీలకం

పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నీటి సంరక్షణ, వ్యవసాయం, రవాణా అభివృద్ధి, సాంకేతికత వినియోగం.. మహిళా సాధికారత, విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలే దేశాన్ని అగ్రస్థానాన నిలబెడతాయని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. యువత నూతన ఆలోచనలు, నైపుణ్యాలను స్వీకరిస్తూ వారికి విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. అలాగే, అవినీతిని నిర్మూలించాలని.. రాజకీయాల్లో కొత్త తరానికి అవకాశం ఇవ్వడమే కాక పేదరిక నిర్మూలనకు ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో మార్పులు, పాలనలో అవినీతి నిర్మూలన, సేవాగుణం, అభివృద్ధి చేయగలిగే నేతలను ఎన్నుకోవడం.. ప్రజల ఆర్థిక శ్రేయస్సు, సామాజిక సమానత్వం, సాంకేతిక పురోగతి, పర్యావరణ స్థిరత్వం వంటివి అమల్లోకి తీసుకురాగలిగితే దేశాన్ని 2047 నాటికి ప్రపంచంలో అగ్రగామిగా నిలబెట్టడం కష్టమేమీ కాదని ధన్వంతరి కళాశాల విద్యార్థులు వెల్లడించారు. ఈ సందర్భంగా 'సాక్షి' టాక్ షోలో పలువురు విద్యార్థులు వెల్లడించిన అభిప్రాయాలు..

కొన్ని అంశాల్లో సరైన నిర్ణయాలు



భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్నా కొంత వెనకబాటు ఉంది. అధిక జనాభా, పేదరికం, తక్కువ తలసరి ఆదాయం, అవినీతి, వసతుల లేమి, జవాబుదారీతనంపై సరైన నిర్ణయాలు తీసుకుంటే 2047 నాటికి ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుంది.

– జి.నాగరాజు, ప్రిన్సిపాల్

సమూల మార్పులతోనే..



దేశాభివృద్ధికి కొన్ని వ్యవస్థల్లో సమూల మార్పు చేయాలి. ప్రధానంగా విద్య, వైద్యం అందరికీ అందాలి. ఇందుకోసం యువత సేవలు వినియోగించుకుంటూ ఉపాధి రంగాల్లో చేయూత ఇవ్వాలి. రిజర్వేషన్లలోనూ మార్పులు చేపట్టాలి.

– ఎ.ధనలక్ష్మి

చట్టాల్లో సంస్కరణలతో...



పెరుగుతున్న హింస.. పడుతున్న శిక్షలకు సంబంధం లేదు. ఈ విషయమై దేశంలో అమలవుతున్న చట్టాల్లో వీలైనంతగా సంస్కరణలు చేయాలి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారికి ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత కల్పించాలి.

– ఎం.వినోద్‌కుమార్

వనరుల వినియోగమే కీలకం



దేశంలో వనరులు, మేధావులు, యువతకు కొదువ లేదు. కరోనా వ్యాక్సిన్ ఇతర దేశాలకు ఎగుమతి చేసిన ఘన చరిత్ర మనది. వనరులు, యువత సేవలను సక్రమంగా వినియోగించుకుంటే భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుంది.

– పి.అక్షిత

సరికొత్త విధానమే మేలు



ప్రస్తుతం కొనసాగుతున్న విద్యావ్యవస్థలో సరికొత్త విధానం తీసుకురావాలి. నిరుపేదలకు విద్య అందుబాటులోకి రావాలి. అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. అలాగే, ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతులు కల్పించి బలోపేతం చేయాలి.

– షేక్ భాను

సేవ చేస్తేనే ఎన్నుకోవాలి..



ప్రజాప్రతినిధులను ఎన్నుకునే విషయంలో ప్రజలు తమ ఓటు విలువ తెలుసుకోవాలి. ప్రధాన పార్టీలను మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా ప్రజలకు సేవ చేయగలిగే నేతను ఎన్నుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాన్ని అంతా గుర్తించాలి.

– బి.వంశీ

యువత రాజకీయాల్లోకి రావాలి



రాజకీయాల్లోకి యువత, మేధావులు ఎక్కువగా రావాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తే ఉత్సాహంగా అభివృద్ధిలో భాగస్వాములవుతారు. అలాగే, వంశపారంపర్యాన్ని నిర్మూలించాలి.

– జి.రాజ్‌కుమార్

పదేళ్లలో అత్యధికం.. 37.5అడుగులు

- రెండేళ్లుగా వణుకుతున్న మున్నేటి పరీవాహకం
- గతేడాది భారీ నష్టాన్ని మిగిల్చిన వరద
- ప్రస్తుత వర్షాలతో స్థానికుల్లో ఆందోళన



మధిర : అలుగు పోస్తున్న మధిర చెరువు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గత ఏడాది మున్నేటికి వరద పోటెత్తగా పరీవాహక ప్రాంత కాలనీలన్నీ నీట మునిగాయి. ఈనేపథ్యాన ప్రస్తుత వర్షాలతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా గత ఏడాది అధికారిక లెక్కల ప్రకారం 37.5 అడుగులు, అనధికారికంగా దాదాపు 42 అడుగుల మేర మున్నేటికి వరద చేరింది. ఇక 2023లోనూ మున్నేరుకు వరద పోటెత్తింది. అయితే, గత ఏడాది ఎదురైన చేదు అనుభవాలతో అప్రమత్తంగానే ఉన్నా అటు అధికారులు, ఇటు ప్రజల్లో ఆందోళన వీడడం లేదు.

మున్నేరు ముంచింది..

గత ఏడాది ఆగస్టు 31, సెప్టెంబర్ 1న వచ్చిన వరదలతో మున్నేరు పరీవాహకం మొత్తం నీట మునిగింది. 42 అడుగుల మేర వరద రావడంతో ఖమ్మం నగరంలోని 14 డివిజన్లు, ఖమ్మంరూరల్ మండలంలోని 20 కాలనీలు వరద ముంపు బారిన పడి దాదాపు 80 శాతం కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. కొందరి ఇళ్లు పూర్తిగా ధ్వంసమై.. మరికొందరికి పాక్షికంగా దెబ్బతినడంతో పాటు ఉపకరణాలు పనికి రాకుండా పోయాయి.

2023లో 30 అడుగులకు పైగా..

గత 20 ఏళ్లలో మున్నేరు వరదను పరిశీలిస్తే అత్యధికంగా గత ఏడాదే నమోదైంది. అంతకుముందు 2023 జూలై 27న 30.70 అడుగులు, 2005లో 26 అడుగుల వరద వచ్చింది. అయితే, 2005లో మున్నేటికి ఇరువైపులా ఇన్ని కాలనీలు లేకపోవడంతో పెద్దగా నష్టం జరగలేదు. దాదాపు 18 ఏళ్ల తర్వాత 2023–24లో 30 అడుగుల మేరకు రావడంతో అదే అత్యధిక వరదగా నమోదైంది. కానీ 2024–25కు సంబంధించి 2024 సెప్టెంబర్ 1న ఊహించనంతగా 42 అడుగుల వరకు వరద రావడం గమనార్హం.

ఎప్పుడేం జరుగుతుందో..

జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మున్నేరు, ఆకేరు పరీవాహక ప్రాంత కాలనీల్లోని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గత 60 ఏళ్లలో ప్రశాంతంగా ఉన్న మున్నేరు గత రెండేళ్లుగా నిద్ర లేని రాత్రులను మిగులుస్తోందని కాలనీవాసులు కన్నీటిపరంతమవుతున్నారు. ప్రస్తుతం ఎడతెరిపి లేని వర్షాలతో అధికారుల ముందస్తు చర్యలతో జనానికి మరింత భయం కలిగిస్తోంది. ఏ క్షణమైనా పునరావాస కేంద్రాలకు వెళ్లేలా విలువైన సామగ్రిని సర్దుకుంటున్నారు.

కొనసాగిన వాన

జిల్లాలో గురువారం కూడా వర్షం దంచికొట్టింది. పలు ప్రాంతాల్లో భారీ వర్షం, మిగతాచోట్ల ఓ మోస్తరు వర్షంతో వాగులు, చెరువుల్లోకి నీరు చేరింది. గురువారం ఉదయం 8–30 నుంచి రాత్రి 9గంటల వరకు అత్యధికంగా చింతకాని మండలం నాగులవంచలో 66 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఎర్రుపాలెం మండలంలో కట్టలేరుకు వరద పెరగగా, ముదిగొండ మండలం వల్లభి పెద్ద చెరువుకు అలుగు పడింది. వైరా నది ఉధృతితో స్నానాల లక్ష్మీపురం, సిరిపురం మధ్య రాకపోకలు నిలిపివేశారు. కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ నుంచి నీటి విడుదల తగ్గించడమే కాక దిగువకు 2,043 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో పాటు అలుగు ద్వారా మరో 7,667క్యూసెక్కులు పాలేరు ఏటిలో కలుస్తుంది. ఈ మేరకు రిజర్వాయర్ నీటిమట్టం 23.45అడుగుల వద్ద నిలకడగా ఉంది. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టమైన 18.3అడుగులు దాటి 19 అడుగులకు చేరింది. ఇక డోర్నకల్ వద్ద మున్నేరు 140 మీటర్లకు గాను 136, ఖమ్మం జిల్లా తీర్థాల వద్ద 20 అడుగులకు గాను 10, ఆకేరు తిప్పారెడ్డిగూడెం వద్ద 135 మీటర్లకు 132 మీటర్లు, ఖమ్మం కాల్వొడ్డు వద్ద మున్నేరు 7.90అడుగులుగా నమోదైంది.



నేలకొండపల్లి మండలం చెరువుమాధారం సమీపాన రోడ్డుపైకి చేరిన వరద



ఏదీ స్వాతంత్ర్య ఫలాలు?

- 78ఏళ్లు దాటినా అదే పేదరికం, అవినీతి
- 'సాక్షి' సర్వేలో జిల్లావాసుల ఆవేదన

ఖమ్మంమయూరిసెంటర్: స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచిపోయాయి. ఈ సమయంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు పూర్తిగా నెరవేరాయా అంటే జిల్లా వాసులు లేదనే బదులిచ్చారు. ఇంకా కొన్ని సమస్యలు పట్టి పీడిస్తున్నాయా అన్న ప్రశ్నకు ఔననే సమాధానం ఇచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఆధ్వర్యాన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో మూడు ప్రశ్నలతో పురుషులు, మహిళలు 30 మంది చొప్పున 60 మందిని ఆరా తీయగా ఆసక్తికర సమాధానాలు లభించాయి. ఈ జవాబుల్లో ప్రజల మనోభావాలు, ఆవేదన వెల్లడయ్యాయి.

పెద్దసమస్యగా పేదరికం, అవినీతి


'78 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత మీరు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఏది?' అన్న ప్రశ్నకు వచ్చిన సమాధానాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. సర్వేలో పాల్గొన్న 60 మందిలో 24 మంది పేదరికాన్ని, 17 మంది అవినీతిని ప్రధాన సమస్యలుగా పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఉన్న సమస్యలే ఇంకా ప్రజలను వేధిస్తున్నాయని ఈ ఫలితం స్పష్టం చేసింది. కేవలం ఎనిమిది మాత్రమే నాణ్యమైన విద్య లేకపోవడాన్ని, ఆరుగురు వైద్యం అందడం లేదని, ఐదుగురు కులవివక్షను సమస్యగా చెప్పగా.. ప్రాథమిక అవసరాలు మరింత మందికి చేరాలని తేలింది.

అందరికీ అందని ఫలాలు..

'స్వేచ్ఛ, సమానత్వం నిజంగానే అందరికీ చేరుతోందా?' అనే ప్రశ్నకు సర్వేలో పాల్గొన్నవారిలో ఎక్కువ మంది ప్రతికూల అభిప్రాయం వ్యక్తం చేశారు. మొత్తం 60మందిలో 36 మంది 'లేదు' అని బదులివ్వగా, కేవలం 16 మంది 'అవును' అని, ఎనిమిది మంది 'కొద్దిగా' అని పేర్కొన్నారు. సమాజంలో ఇంకా వర్గ, కుల, లింగ వివక్ష ఉందని ఈ సమాధానాలు వెల్లడించగా.. సామాజిక సమానత్వం విషయంలో ఇంకా చాలా చేయాల్సి ఉందని నిరూపితమైంది.


చట్టసభలే కీలకం..

సమస్యల పరిష్కారానికి ఏ రంగం మరింత నీతి, నిజాయితీతో పనిచేయాలని ప్రజలు భావిస్తున్నారో తెలుసుకునేలా వేసిన ప్రశ్నకు ఎక్కువ మంది చట్టసభలనే పేర్కొనడం గమనార్హం. సర్వేలో పాల్గొన్న 60మందిలో 29మంది చట్టసభలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఇక అధికార యంత్రాంగం పనితీరులో 22మంది మార్పును ఆశించారు. ఈ రెండు సమాధానాల ద్వారా చట్టసభలు, యంత్రాంగంపై ప్రజలకు ఉన్న నిరాశ వెల్లడైంది. ఇక ఐదుగురు మీడియా రంగం, నలుగురు న్యాయస్థానాల్లో మార్పును ఆశిస్తూ సమాధానాలు చెప్పారు.




78 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత మీరు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఏది?

అవినీతి | పేదరికం | నాణ్యమైన విద్య | వైద్యం | కుల వివక్ష



స్వేచ్ఛ - సమానత్వం నిజంగానే అందరికీ చేరుతోందా ?

అవును | లేదు | కొద్దిగా



స్వాతంత్ర్య ఫలాలు అందరికీ దక్కేలా మరింత నీతి, నిజాయితీగా పనిచేయాల్సిన రంగం?

చట్టసభలు | అధికార యంత్రాంగం | మీడియా | న్యాయస్థానాలు

పేదరికం తగ్గడం లేదు..



చదువుకునేందుకు అవకాశాలు ఉన్నా, ఆ తర్వాత సరైన ఉపాధి లేక యువత ఇబ్బంది పడుతున్నారు. సంపాదించాల్సిన సమయంలో ఖాళీగా ఉంటే కుటుంబాలపై భారం మోపినట్లవుతోంది. కనీస ఆదాయం లేక లక్షల కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నాయి. ఇదే సమయాన అవినీతి కూడా వేధిస్తోంది.

– బి.రాజేష్, ఖమ్మం

పేరుకే సమానత్వం..



చిన్ననాటి నుంచి సమానత్వం అనే పదాన్ని వింటున్నా నేటికీ సమాజంలో కనిపించడం లేదు. ఆశించిన మేర నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదు. అన్ని రంగాల్లో పోటీతో పాటు అవినీతి, అక్రమాలు పెరిగాయి. నిజాయితీగా పని చేయాల్సిన పాలకులు, యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

– ఎస్.దివ్య, ఖమ్మం

ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా పటిష్ట చర్యలు



వీసీలో మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ అనుదీప్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, అధికారులు

వీసీలో మంత్రులు పొంగులేటి, తుమ్మల

ఖమ్మం సహకారనగర్: వాతావరణ శాఖ సూచనల ప్రకారం అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. హైదరాబాద్ నుంచి పొంగులేటి, సీఎస్ రామకృష్ణారావు, ఖమ్మం కలెక్టరేట్ నుంచి తుమ్మల గురువారం కలెక్టర్లతో వీసీ ద్వారా మీక్షించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మరికొన్ని రోజులు వర్షాలు ఉన్నందున వరద ముంచెత్తినా నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సహాయక చర్యల కోసం రూ.కోటి నిధులు విడుదల చేయగా, అవసరమైతే మరిన్ని నిధులు కూడా విడుదల చేస్తామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆకేరు, మున్నేరు, పాలేరు, వైరా, లంకాసాగర్‌లో వరద నిలకడగా ఉన్నప్పటికీ ఎగువ జిల్లాల్లో వర్షం వివరాలు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీసీలో కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, కెఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ అధికారులతో సమావేశమై వర్షపాతం వివరాలు, వరద అంచనా, ముందస్తు చర్యలపైనే కాక సీజనల్ వ్యాధుల కట్టడిపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య, డీఎంహెచ్ఓ కళావతి బాయి, సీపీఓ శ్రీనివాస్, వివిధ శాఖల ఎస్ఈలు శ్రీనివాసాచారి, ఎం.వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిభ కనబర్చిన పోస్టుమాస్టర్లకు సత్కారం



సీతారాంపురం బీపీఎం, ఏపీఎంను సత్కరిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ ద్వారా ఖాతాదారులకు ఉత్తమ సేవలందించిన పలువురు పోస్టుమాస్టర్లను సన్మానించారు. నార్త్ సబ్ డివిజన్ బ్రాంచి పోస్టాఫీసుల పోస్టు మాస్టర్లు, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ల సమావేశం ఖమ్మంలోని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగింది. ఈసందర్భంగా సీతారాంపురం, కొక్కిరేణి, వెంకటగిరి పోస్టు మాస్టర్లు చెరుకూరి కోటేశ్వరరావు, వి.శ్రీనివాస రావు, హరిప్రియసింగ్ రాజ్‌పుత్ తదితరులను సన్మానించారు. ఖమ్మం డివిజన్ పోస్టల్ సూప రింటెండెంట్ వి.వీరభద్రస్వామి, ఇన్‌స్పెక్టర్ బీ.కే.మహేశ్వరి, ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ పోస్టు మాస్టర్ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

కూలిన వైరా రిజర్వాయర్ కాల్వ గైడ్‌వాల్స్



ఎడమ కాల్వ వెంట కూలిన గైడ్ వాల్స్

వైరారూరల్: వైరా మండలం విప్పలమడక సమీపాన వైరా రిజర్వాయర్ ఎడమ కాల్వ గైడ్ వాల్స్ గురువారం కూలింది. రెండో విడత ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఇటీవల రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వలకు ఇరువైపు లా గైడ్ వాల్స్‌లు నిర్మించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో విప్పల మడక సమీపంలో డ్రెయినేజీ నీరు కాల్వలోకి చేరుతుండడంతో గైడ్‌వాల్స్ ఓవైపు కుంగి సుమారు 100 మీటర్ల మేర కూలింది. రూ.లక్ష లు వెచ్చించి నిర్మించిన నిర్మాణం ఆదిలోనే కూలడంపై విమర్శలు వస్తుండగా.. మరమ్మ తులు చేయిస్తామని అధికారులు తెలిపారు.

'ఆఫ్‌టైప్' మొక్కలపై విచారణ చేయించండి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

సత్తుపల్లి: ఆఫ్‌టైప్ ఆయిల్‌పామ్ మొక్కల సర ఫరాతో నష్టపోయినట్లు తాము ఇచ్చిన ఫిర్యా దులపై విచారణ వేగవంతం చేయాలని బాధిత రైతులు కోరారు. సత్తుపల్లిలో గురువారం జిల్లా, డివిజనరల్ ఉద్యానవన శాఖ అధికారు లు ఎంవీ.మధుసూదన్, శంకర్, ఆయిల్‌ఫెడ్ ప్రత్యేక అధికారి అడపా కిరణ్‌తో రైతులు సమా వేశమయ్యారు. తోటల పరిశీలనకు అధికారుల తో కమిటీని నియమించడమే కాక రీప్లేస్ చేసిన మొక్కల్లో ఆఫ్‌టైప్ వస్తే ఎవరు బాధ్యత వహి స్తారో చెప్పాలని ప్రశ్నించారు. అంతేకాక ఇన్నేళ్ల కష్టానికి పరిహారం, బాధ్యులపై చర్యల విష యాన్ని వెల్లడించాలన్నారు. రైతులు కారం శ్రీరాములు, రాము, జగ్గారావు, రామకృష్ణ, సత్యనారాయణరెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకట్రావు, ఉమామహేశ్వరరెడ్డి, చెలికాని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సప్తపదుల ఖాదీ



గ్రామోద్యోగ్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఖాదీ వస్త్రాలు

- ఖమ్మంలో ఖాదీ గ్రామోద్యోగ్‌కు ఆదరణ
- స్వాతంత్రోద్యమం నుంచి నగరంలో నిర్వహణ
- సత్యం, అహింస స్వదేశీ భావాలకు ప్రతీక

ఖమ్మంగాంధీచౌక్: ఖాదీ లేదా ఖద్దరు వస్త్రాలు మహాత్మా గాంధీ నమ్మిన సత్యం, అహింస, స్వదేశీ భావాలకు ప్రతీకగా నిలిచాయి. స్వాత్రంత్య ఉద్యమంలో ఖాదీ వస్త్రాలు దేశ భక్తిని పెంపొందించాయి. చేనేత కార్మికులకు ఉపాధి కల్పిం చాయి. తక్కువ ధరకు లభించే ఈ వస్త్రాలు వేసవిలో చల్లద నాన్ని, చలికాలంలో వెచ్చదనాన్ని ఇస్తాయి. తొలుత నూలు వడికి మగ్గాలపై నేసేవారు. సాంకేతికత పెరిగాక యంత్ర పరికరాలపై బట్టను తయారు చేస్తున్నారు. వయసులో పెద్ద వారు, రాజకీయ నాయకులు ఖద్దరు దుస్తులను ఎక్కువగా వినియోగిస్తారు. కాలక్రమంలో ఖాదీ వస్త్రాల కార్ఖానాలు వెలిశాయి. పలు రాష్ట్రాల్లో ఖాదీ పరిశ్రమలు పెరగటంతో ఉపాధి అవకాశాలు కూడా లభించాయి. కుటీర పరిశ్రమ లుగానూ వెలిశాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఖాదీ వస్త్రాల తయారీకి ప్రత్యేక స్థానాలు ఉన్నాయి. ఏపీలోని పొందూరు ఖద్దరు, తెలంగాణలో వావిలాల ఖాదీ ఆదరణ చూర గొన్నాయని చెప్పొచ్చు.

విస్తరించిన వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్

స్వాతంత్రోద్యమంలో ఖాదీకి లభించిన ఆదరణ, ప్రాము ఖ్యతతో కరీంనగర్ జిల్లా జగిత్యాలలో వావిలాల గ్రామో ద్యోగ్ ప్రతిష్టాపన జరిగింది. కుటీర పరిశ్రమగా ఆవిర్భవించి అంచెలంచెలుగా రాష్ట్రంలో ఎనిమిది పరిశ్రమలకు విస్తరిం చింది. పరిశ్రమలు, చేతి మగ్గాలు, దుకాణాల్లో దాదాపు వెయ్యి మంది పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. కరీంనగ ర్, హనుమకొండ, తొర్రూరు తదితర ప్రాంతాలకు పరిశ్రమ విస్తరించగా, పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఖద్దరు విక్రయ దుకాణాలను నిర్వహిస్తున్నారు. జగిత్యాల, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, ఖమ్మం, తొర్రూర్, హుజూరాబాద్, హైదరాబాద్‌లో పలు బ్రాంచీలు నిర్వహిస్తు న్నారు. ఈ సంస్థకు చైర్‌పర్సన్‌గా దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు తనయ ఎంఎల్‌సీ సురభి వాణితో పాటు కార్యదర్శిగా వడిదల కిషన్‌రావు వ్యవహరిస్తున్నారు.



ఖమ్మం గ్రామోద్యోగ్‌కు 70 ఏళ్ల చరిత్ర

వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాపన బ్రాంచిని ఖమ్మం లో 70 ఏళ్ల కిత్రం ఏర్పాటు చేశారు. ఖమ్మం నగరంలోని గాం ధీ నడయాడిన గాంధీచౌక్‌లోనే ఈ బ్రాంచిని ఖాదీ గ్రామో ద్యోగ్ ఎంపోరియం ఏర్పాటు చేశారు. నగరానికి చెందిన వేములపల్లి రంగారావు గ్రామోద్యోగ్‌లో ఉద్యోగిగా చేరి 40 ఏళ్ల పాటు నిర్వహించారు. ఆ తర్వాత ఆయన కుమారుడు కృష్ణారావు 30 ఏళ్లుగా గ్రామోద్యోగ్ ఉద్యోగిగా నిర్వహిస్తు న్నారు. ఇక్కడ వంద శాతం ఖాదీ దుస్తులు పంచెలు, లుం గీలు, టవల్స్, చొక్కాలు విక్రయిస్తున్నారు. ఖమ్మం, వైరా, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, కోదాడ, నల్లగొండ, ఏపీలోని జగ్గయ్యపేట, నందిగామ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి రెగ్యులర్ కష్టమర్లు వస్తుంటారు. ఇక రాజకీయ నాయకులు ఖద్దరు చొక్కాలు, పంచెల కోసం ప్రత్యేక ఆర్డర్లు ఇస్తారు. ఇక స్వాంతత్ర్య దినోత్సవం, గాంధీ జయంతి, వర్ధంతి, రిపబ్లిక్ డే వంటి ప్రత్యేకమైన రోజుల్లో సంస్థ ప్రత్యేక తగ్గింపు ధరలకు ఖాదీ బట్టను విక్రయిస్తుంది. ప్రస్తుత స్వాతంత్ర్య దినోత్సవం సం దర్భంగా 30 శాతం డిస్కౌంట్ సౌకర్యాన్ని కల్పించింది. దీం తో విక్రయాలు మరికొంత పెరిగాయి.

తగ్గని ఆదరణ



ఖాదీ వస్త్రాలకు ఆదరణ ఎప్పటికీ ఉం టుంది. వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ వస్త్రాలకు రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉంది. ఖమ్మంలో 70 ఏళ్లుగా గ్రామోద్యోగ్‌ను నిర్వహిస్తు న్నాం. లాభాపేక్ష లేకుండా సంస్థ ఖాదీ తయారీ, విక్రయాలు చేస్తోంది.

– వేములపల్లి కృష్ణారావు, మేనేజర్, ఖమ్మం గ్రామోద్యోగ్ ఎంపోరియం

గ్రామోద్యోగ్‌లోనే కొంటా..



గాంధేయ వాదులం. వావిలాల గ్రామోద్యోగ్‌లో ఖద్దరు బట్టలను కొను గోలు చేసి చొక్కాలను ధరిస్తున్నాం. లుంగీలు, టవల్స్‌ను కూడా వాటినే వినియోగిస్తున్నాం. ఆరోగ్యపరంగా కూడా ఈ బట్ట అనుకూలంగా ఉంటుంది. నాణ్యత బాగుంటుంది.

–తూములూరి లక్ష్మీనరసింహారావు, ఖమ్మం

శాలివాహనులు రాజకీయంగా ఎదగాలి

- రిటైర్డ్ డీజీపీ పూర్ణచంద్రరావు



మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

ఖమ్మం మామిళ్లగూడెం: శాలివాహనులు అవకాశాలను అందిపుచ్చుకుంటూ రాజకీయం గా మరింత ఎదగాలని మాజీ డీజీపీ జుజ్జువరపు పూర్ణచంద్ర రావు సూచించారు. శ్రీశ్రీశ్రీ దక్ష ప్రజాపతి శాలివాహన సొసైటీ, శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం ఖమ్మంలో నిర్వహించిన రాజకీయ చైతన్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమ్మరి కులస్తులెవరూ తెలంగాణ అసెంబ్లీలో అడుగుపెట్టకపోవడం బాధాకరమని తెలిపారు. ఈమే రకు రాజకీయ అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఎదగాలని సూచించారు. శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ ఉన్నత విద్యన భ్యసించే శాలివాహన విద్యార్థులకు సహకరిస్తామని తెలిపారు. ఈసమావేశంలో సూర్యారావు, శంకర్రావు, మల్లెల రామనాథం, శేషగిరిరావు, హన్మంతరావు, ఉపేందర్, సత్యనారాయణ, ప్రసాద్, చిరంజీవి, రాచర్ల రాజు, రమేష్, వెంకటే శ్వర్లు, భాస్కర్, సైదారావు, సర్వయ్య, పరశురాములు, కృష్ణ పాల్గొన్నారు.

నాలుగో శనివారం.. బ్యాగ్ లెస్ డే !

విద్యాశాఖపై సమీక్షలో కలెక్టర్ అనుదీప్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, డీఈఓ నాగపద్మజ

ఖమ్మం సహకారనగర్: ఇక నుంచి ప్రతీనెల నాలుగో శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో 'బ్యాగ్ లెస్ డే'గా నిర్వహించాలని.. ఆ రోజు క్రీడా పోటీ లు, పాటలు పాడించడమే కాక మొక్కల పెంపకం, మాక్ అసెంబ్లీ ఏర్పాటుచేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం విద్యాశాఖపై అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సమీక్షించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్, సమ గ్రాభివృద్ధి దిశగా కార్యక్రమాలు ఉండాలని తెలిపారు. పీఎంశ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మంజూరైన నిధులతో పనులు పూర్తిచేయించడమే కాక రెండో యూనిఫామ్, పాఠ్య, నోట్ బుక్స్ పంపిణీ చేసి వివరాలను ఆన్ లైన్‌లో అప్‌డేట్ చేయాలని చెప్పారు. యూనిఫామ్ పంపిణీలో నిర్లక్ష్యం వహించే ఎంఈఓలకు మెమో జారీ చేయాలని తెలిపారు. అలాగే, హాజరు నమో దుపై సూచనలు చేసిన కలెక్టర్... గుడిసెలు, శిథిల భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలల స్థానంలో కంటైనర్లు ఏర్పాటు చేయించాలన్నారు. డీఈఓ నాగపద్మజ, ఎంఈఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

■ **ఖమ్మంగాంధీచౌక్:** నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ద్వారా లబ్ధిదారులకు పారదర్శకంగా కేటాయిస్తున్నామని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కామేపల్లి మండలం పింజరమడుగు, ముచ్చర్ల ప్రాంత 50మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయించాక ఆయన మాట్లా డారు. త్వరలోనే వీరికి మంత్రులు, ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కామేపల్లి తహసీల్దార్ సుధాకర్, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

సహకార పాలకవర్గాల పదవీ కాలం పొడిగింపు

- అవకతవకలు జరిగిన సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు

ఖమ్మంవ్యవసాయం: సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలాన్ని పెం చుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక వ్యవ సాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), తెలంగాణ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్(టీజీసీఏబీ) పాలకవర్గాల పదవీ కాలం పొడిగింపు గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. 2020 జనవ రిలో సహకార సంఘాలకు ఎన్నికలు జరగగా, ఫిబ్రవరిలో కార్యవర్గాలు పదవీ బాధ్యతలు స్వీకరించాయి. ఈ ఏడాది ఫిబ్రవరితో ఐదేళ్ల కాలం పూర్తి కాగా, మరో ఆరు నెలలు పొడిగించారు. ఇది కూడా గురువారంతో ముగియగా.. మరో ఆరు నెలల(తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు) పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే, పనితీరు బాగా లేని, అవకతవకలకు పాల్పడిన సం ఘాల కమిటీల స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో 101 పీఏసీఎస్‌లు ఉండగా.. జిల్లాల వారీగా ఖమ్మంలో 76, భద్రాద్రి కొత్తగూడెం లో 21, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో రెండేసి సంఘాలు ఉన్నాయి. ఇం దులో ఆరు సంఘాల పాలకవర్గాలపై అవినీతి ఆరోపణలు ఉండటంతో పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లను నియమిస్తారు.

సింగరేణి ట్రక్కు.. అప్పాయిగూడెం ఇంజిన్!



అప్పాయిగూడెం జీపీ ఇంజిన్‌తో నడుస్తున్న ట్రాక్టర్

కారేపల్లి: మండల కేంద్రమైన సింగరేణి((కారేప ల్లి) గ్రామపంచాయతీ ట్రాక్టర్ మరమ్మతుకు వచ్చింది. ఏళ్లుగా కనీసం ఇంజన్ ఆయిల్ కూడా మార్చకపోవడంతో మొరాయిస్తోంది. ఈమేరకు మెకానిక్‌కు చూపిస్తే మరమ్మతులకు రూ.20వేలు అవసరమని చెప్పడంతో నిధులు లేక అధికారు లు చేతులెత్తేశారు. అయితే, కారేపల్లిలో 12వార్డు లతో పాటు రెండు కిలోమీటర్ల మేర ప్రధాన రహ దారి ఉండడంతో ప్రతిరోజు చెత్త సేకరించాల్సి వస్తోంది. ప్రస్తుతం ట్రాక్టర్ ఇంజన్ లేకపోవడం తో అప్పాయిగూడెం గ్రామపంచాయతీ నుంచి ఇంజన్‌ను తెప్పించి కారేపల్లి ట్రక్కు అమర్చి చెత్త సేకరిస్తున్నారు.

గోపాలపురం దాడి ఘటనలో ఏడుగురి అరెస్ట్

ఖమ్మం అర్బన్: మద్యం మత్తులో పరస్పరం దాడులు చేసుకున్న ఘటనలో ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. రెండు రోజుల క్రితం ఖమ్మం గోపాలపురంలో జరిగిన ఘటన వివరాలను ఆయన గురువారం వెల్లడించారు. మద్యం మత్తులో రాకేష్ రోడ్డుపై అడ్డం గా పడుకోగా ఆయన భార్య దుర్గాభవానితో సమీపంలో షాప్ నడిపే కవిత, వేణుగోపాల్ వాగ్వాదానికి దిగారు. వీరినడుమ పాతకక్షలకు తోడు కొందరు ఆకతాయిలు తోడవడంతో గొడవ పెరిగి దాడులకు దారి తీసిం ది. ఈక్రమాన ఒక వర్గం వారు పెట్రోల్ తీసుకువచ్చి షాప్ ఎదుట సామ గ్రికి నిప్పంటించగా స్కూటీ కూడా కాలిపోయింది. ఈమేరకు రుదావత్ దుర్గాభవాని ఫిర్యాదుతో గోపాల్, వేణు, వినోద్, లక్ష్మి, కవితపై, బానోత్ వేణు ఫిర్యాదుతో రాకేష్, శ్రీనాథ్, మహేష్, ఉమేష్, వరుణ్ తేజ, కార్తీక్‌పై కేసు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేశామని ఏసీపీ తెలిపారు. మరో ఇద్దరు చికిత్స పొందుతుండగా, ఇంకో ఇద్దరు పరారీలో ఉన్నారని వెల్లడిం చారు. కాగా, దాడుల్లో పాల్గొన్న వారిని పరీక్షించగా ఎవరూ మాదకద్రవ్యా లు తీసుకోనట్లుగా తేలిందని తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన జారీ చేసిన చెక్కు చెల్లకపోవడంతో మహిళకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మూడో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి వి.మాధవి గురువారం తీర్పు చెప్పారు. ఖమ్మం కు చెందిన మాచర్ల యోగానందరావు వద్ద గాదె ఉమాదేవి 2020 జనవ రిలో రూ.8 లక్షల అప్పు తీసుకుంది. తిరిగి 2021 జూన్ 10న రూ.8 లక్ష లకు చెక్కు జారీ చేయగా, ఆమె ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కర ణకు గురైంది. దీంతో యోగానందరావు న్యాయవాది ద్వారా నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం ఆమెకు జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.8లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

తిరుమలాయపాలెం: కడుపునొప్పితో బాధపడుతున్న మహిళ ఉరి వేసు కుని ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని ఎర్రగడ్డ గ్రామపంచాయితీ పరిధి గోపాలపురం గ్రామానికి చెందిన కోసూరి త్రివేణి(30) వ్యవసాయ కూలీ పనులతో జీవనం సాగిస్తుండగా రెండేళ్ల నుంచి తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయాన ఉరి వేసుకుంది. ఆమెకు భర్త మదార్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నటి పూర్ణ, హీరో శివ కందుకూరి పంచుకున్న విశేషాలు



ఒక్కొక్కరం ఒక్కో రంగు - పూర్ణ

● స్కూల్ డేస్‌లో ఇండిపెండెన్స్ డే ప్రోగ్రామ్స్‌లో పాల్గొనేదాన్ని. దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ఓ మంచి గుర్తుగా మిగిలిపోయింది. ఇప్పుడు కూడా నా స్కూల్ డేస్‌ని గుర్తు చేసుకుంటున్నాను. దానికి కారణం దుబాయ్‌లో నేను ఆరంభించిన 'డ్యాన్స్ స్కూల్'. ఈ స్కూల్ స్టార్ట్ చేశాక వచ్చిన తొలి ఇండిపెండెన్స్ డే ఇది. ఈ సందర్భంగా మా స్కూల్ స్టూడెంట్స్‌తో దేశభక్తికి సంబంధించిన రీల్ చేయించాం. సోషల్ మీడియా ద్వారా ఇవాళ రిలీజ్ చేయనున్నాం. రిపబ్లిక్ డే అప్పుడు ఇలాంటిదే చేశాం. అప్పుడు నేను కూడా పాల్గొన్నాను. ఈసారి షూటింగ్స్ ఉండటంతో హైదరాబాద్‌లో ఉన్నాను.

● స్కూల్లో 'ఏ మేరా ఇండియా' అని డ్యాన్స్ చేస్తున్నప్పుడు ఒళ్లు పులకరించిపోయేది. ఇప్పటికీ ఆ పాట పాడుతుంటే ఓ రకమైన ఎమోషన్ కలుగుతుంది. నేను ఫార్మల్‌గా డ్యాన్స్ నేర్చుకున్నాను. అందుకే దేశం పట్ల నాకు ఉన్న భక్తిని దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ద్వారా వ్యక్తపరుస్తుంటాను. అసలు 'ఇండియా' అని పలుకుతుంటేనే ఎంతో బాగుంటుంది.

● చిన్నప్పుడు స్కూల్ ప్రోగ్రామ్స్‌లో పార్టిసిపేట్ చేసినప్పుడు బాగా పర్ఫార్మ్ చేయాలనే దాని మీదే ఎక్కువ ఫోకస్ ఉండేది. అలాగే జెండా రంగులు వచ్చేలా ఒక్కొక్కరం ఒక్కో రంగు డ్రెస్ వేసుకోవడం అనేది ఓ తీపి గుర్తు. తర్వాత తర్వాత మనకు ఇండిపెండెన్స్ రావడానికి ఎందరి త్యాగం ఉందో తెలుసుకుని, వాళ్లందరి మీద గౌరవం పెరిగింది. అలాగే మనం ఇక్కడ క్షేమంగా ఉంటున్నామంటే సరిహద్దుల్లో ఉంటున్న సైనికుల వల్లే. అందుకే ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'సైనికా... సెల్యూట్' అంటున్నాను.

● సైనికుల త్యాగాల గురించి చెబుతుంటే నాకు యాంకర్ రష్మీ గుర్తొస్తున్నారు. ఆమె సోదరుడు ఆర్మీలో ఉన్నారు. యుద్ధం జరిగినప్పుడు అక్కడ ఉన్న తన సోదరుడి గురించి ఇక్కడ వీరి కుటుంబం ఫీలింగ్స్‌ని స్వయంగా చూశాను. సోల్జర్స్ కుటుంబాలు పడే ఆవేదన, దేశ రక్షణలో తమ కుటుంబం నుంచి ఒక వ్యక్తి ఉన్నారనే ఆనందం... ఇలా రెండు ఫీలింగ్స్ కనబడుతుంటాయి.

● భవిష్యత్తులో మన పిల్లలు ఏ ఉద్యోగంలో స్థిరపడతారో చెప్పలేం. కానీ మా అబ్బాయితో మాత్రం 'నిన్ను ఆర్మీలో చేర్పిస్తా' అంటుంటాను. ఎందుకంటే వాడికి ఏ బొమ్మలూ నచ్చవు. అవి ఎంత పెద్దవైనా. వాటి పక్కన చిన్న గన్ ఉంటే చాలు... దాంతోనే ఆడుకుంటాడు. ఎక్కువగా అవే కొనుక్కుంటాడు. అందుకే మా అబ్బాయిలో నాకో సోల్జర్ కనబడుతుంటాడు.

అప్పుడు నేను నెహ్రూ - శివ కందుకూరి

● స్వాతంత్ర్య దినోత్సవం రోజున తప్పనిసరిగా స్కూల్‌కి హాజరవ్వాలనే నియమం ఉంటుంది. రూల్ ఉందని కాదు... ఇష్టంగా వెళ్లేవాణ్ణి. ఆ రోజు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ఎప్పుడూ గుర్తుండిపోయే చిన్ననాటి జ్ఞాపకం. జెండా ఎగరేస్తుంటే సెల్యూట్ చేస్తూ, చూడటం నాకు చాలా హ్యాపీగా ఉండేది. అందుకే మిస్ కాకుండా స్కూల్‌కి వెళ్లేవాణ్ణి. నా చిన్నప్పుడు స్కూల్లో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ కోసం నెహ్రూజీలా డ్రెసప్ అయ్యాను. అలా రెడీ అయి, వెళ్లడం నాకు గుర్తుంది. అప్పుడు దేశభక్తి పూర్తి అర్థం తెలియదు. అయితే ఇప్పుడు ఒక హీరోగా ఏదైనా ఫ్రీడమ్ ఫైటర్ రోల్ చేసే అవకాశం వస్తే... తప్పకుండా చేయాలని ఉంది. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన పోరాట యోధుల గురించి మరోసారి గుర్తు చేసే అవకాశం ఉంటుంది కదా.

● మామూలుగా మనం చదువుకుంటున్నప్పుడు దేశ, విదేశీయులు కూడా ఆ ఇన్‌స్టిట్యూషన్స్‌లో చేరుతుంటారు. అలా నేను అమెరికాలో చదువుకున్న యూనివర్సిటీలో పలు దేశాలవారిని కలిశాను. వాళ్ల దేశాల్లో ఉండే నియమ నిబంధనలు విన్నప్పుడు 'నా దేశం ఎంతో మెరుగ్గా ఉంది కదా' అనిపించింది. ఒక ఫ్రీ కంట్రీలో బతుకుతున్నప్పుడు ఆ దేశానికి మనం విలువ ఇవ్వాలి. ఆ దేశం గురించి మనం గర్వపడాలి. ముఖ్యంగా ఆడవాళ్ల విషయంలో కొన్ని దేశాల్లో హద్దులు హారిబుల్. అమ్మాయిలు బయటకు వెళ్లకూడదు... డ్రైవ్ చేయకూడదు వంటి నియమాలు చూసి, మగవాళ్ల ఆధిపత్య పోరు ఎంతలా ఉందీ అనిపించింది. అఫ్‌కోర్స్ ఇప్పుడు ఆ నియమాల్లో కాస్త వెసులుబాటు వచ్చిందనుకోండి.

● నేను యూఎస్‌లో ఓ పదేళ్ల పాటు ఉన్నాను. ట్రాన్సిల్‌వేనియాలో ఉన్న 'ఇండియన్ అసోసియేషన్' వారు 2013లో ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ ఆరంభించారు. ఆ వేడుకల్లో రెండుసార్లు జెండా ఎగరేసే అదృష్టం నాకు దక్కింది. విదేశీ గడ్డ మీద మన మాతృదేశం జెండా ఎగరేయడం అనే ఫీలింగ్ మాటలకు అందనిది. పైగా మన భారతీయులు విదేశీ గడ్డపై ఐకమత్యంతో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం అనేది నాకు బాగా అనిపించింది. నా మూలాల మీద నాకు మరింత ప్రేమ పెరిగేలా చేసింది.

స్వాతంత్ర్యదినోత్సవ థీమ్...

నయా భారత్

థీమ్ అనేది అలంకారప్రాయం కాదు. మన భవిష్యత్ లక్ష్యాల గురించి బలంగా చెప్పే... సంక్షిప్త సందేశం. ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచిస్తూ, కొత్త శక్తులతో ముందడుగు వేసినప్పుడే కొత్త భారతాన్ని ఆవిష్కరించుకోగలుగుతాము. ఈ భావాన్ని ప్రతిబింబించేలా 'నయా భారత్' అని ఈ స్వాతంత్ర్య దినోత్సవం థీమ్‌ను నిర్ణయించారు.



డాలీగారి దేశభక్తి

'దేశభక్తి మీకేనా? నాకు కూడా ఉంది' అని చెప్పకనే చెప్పింది డాలీ. పెయింటర్ డాగ్‌గా పాపులర్ అయిన డాలీకి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. తాజాగా త్రివర్ణ పతాకం పెయింట్ వేసి 'ఆహా' అనిపించేలా చేసింది డాలీ. 'శునక రాజమా... నీ దేశభక్తికి జోహార్లు' అంటున్నారు నెటిజనులు.



తండ్రి పేరు వందేమాతరం..!

'పేరులో పవర్ ఉంటుంది' అంటారు. కొన్ని పేర్లు వింటే 'నిజమే!' అనిపిస్తుంది. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ఈ కుటుంబసభ్యుల పేర్లలో దేశభక్తి ధ్వనిస్తుంది. తండ్రి పేరు వందేమాతరం ప్రహ్లాద్ నాయక్. కుమారుడి పేరు తిరంగా ప్రియదర్శన్. కూతురు పేరు జైహింద్ జగ్యన్‌సేని. 'మతాన్ని ప్రతిఫలించే పేర్లు కాకుండా దేశభక్తిని ప్రతిఫలించే పేర్లు అంటే నాకు ఇష్టం' అంటున్న వందేమాతరం స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు. వందేమాతరం ఇంటిలోని గదులు జాతీయజెండాలోని మూడు రంగులతో అలంకరించి ఉంటాయి.

ఈ అమెరికన్ మన జాతీయగీతం అద్భుతంగా ఆలపిస్తాడు!

పదిహేడు సంవత్సరాల అమెరికన్ గేబ్ మెరిట్ ఆలపించిన మన జాతీయగీతం 'జన గణ మన' సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'ఓ మై గాడ్... నా హృదయం దేశభక్తితో ఉప్పొంగిపోయింది' అనే కాప్షన్‌తో ఈ వీడియోను షేర్ చేసింది దిశ అనే నెటిజన్. 'ఎన్నో దేశాల జాతీయగీతాలు పాడినప్పటికీ గేబ్‌కు మన జాతీయగీతం ఆలపించడం అంటే ప్రత్యేక అభిమానం' అని రాసింది దిశ.



అంటార్కిటికాలో వందేమాతరం





అంటార్కిటికాలోని పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు ఆగస్ట్ పదిహేను పర్వదినాన్ని పురస్కరించుకొని జాతీయజెండా ఎగరేయడానికి సన్నద్ధం అవుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వాతావరణ ప్రతికూలతలు ఉన్నప్పటికీ 'మేము సైతం' అంటూ జాతీయపతాకావిష్కరణకు సన్నద్ధం అవుతున్న దృశ్యం నెటిజనులను ఆకట్టుకుంది. ఉద్యోగులు మంచుపెకిలిస్తుంటే, నేపథ్యంలో 'వందేమాతర గీతం' వినిపిస్తుంటుంది.


● 50 ఏళ్ల షోలే (1975-2025)

షోలే... అప్పుడది తుపాన్ ఇండియా

సినిమా మొత్తం రెండు జతలకు మించి వాడని హీరోలు... హీరోయిన్ ఏమో టాంగేవాలీ... ఇంకో హీరోయిన్ వితంతువు... ముఖ్య క్యారెక్టర్ ఆర్టిస్టుకు రెండు చేతులూ ఉండవు... విలన్‌కు గట్టిగా చూస్తే 20 మందికి మించి గ్యాంగ్ లేదు... లొకేషన్ ఉత్త రాళ్లదిబ్బలు... ఇవాళ్టి పాన్ ఇండియా సినిమాలతో పోల్చి చూస్తే ఈ లక్షణాలతో ఏదైనా సినిమా సూపర్ హిట్ అవుతుందా? అవుతుంది... అయ్యింది... అవుతూనే ఉంది... 'షోలే' - ఒక ప్రెజెంట్ కంటిన్యుయెస్ టెన్స్ 50 ఏళ్లుగా 'షోలే' లిఖించిన రికార్డులు ఎన్నో. చెప్పిన కొటేషన్లు మరెన్నో. 'జో డర్ గయా... సమ్‌ఝో మర్‌గయా'... మరణమే లేని షోలేతో ప్రేక్షకుల వీడని దోస్తీ గురించి ప్రత్యేక కథనం...







'పుష్ప' సినిమా రెండు పార్ట్‌లుగా వచ్చి కోట్లు సంపాదించింది.

ఒక గంధపు చెక్కల స్మగ్లర్ హీరోనా అని ఒకరిద్దరు క్వశ్చన్ చేశారు.

కాని సగటు జనం జానేదో అని సూపర్‌హిట్ చేశారు.

ఈ సగటు జనం ఇక్కడి వరకూ చేయడానికి చాలా మెట్లు పడ్డాయి.

వాటిలో 'షోలే' ఒకటి.

***

సలీమ్–జావేద్ హిందీలో యాంగ్రీ యంగ్‌మేన్‌ను తెచ్చారు. అంటే స్వాతంత్ర్యం వచ్చాక జన్మించి, యుక్త వయసు వచ్చేనాటికి అంటే 1970ల నాటికి దేశ స్థితి చూస్తే ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, బ్లాక్ మార్కెట్. రోజులు ఇలా ఉంటే అమ్మాయి వెంట పరిగెత్తి విరహగీతాలు పాడే హీరో చెల్లుబాటు కాదు అని వాళ్లు కోపంగా ఉండే హీరోని తెచ్చారు. 'జంజీర్'లో అమితాబ్ అలాంటి హీరో. ఇతను ఇన్‌స్పెక్టర్‌గా ఉంటూ కూడా తన తల్లితండ్రులను చంపిన వాణ్ణి చట్టప్రకారం శిక్షించలేకపోతాడు. యూనిఫామ్‌ను వదిలాకే పగ సాధిస్తాడు. చట్టానికి ఆవల కొన్ని పనులు చేసే హీరోలు అలా పుట్టుకొచ్చారు. ఆ తర్వాత 'దీవార్' వచ్చింది. కష్టపడి పని చేసే హీరోకు బదులు అడ్డదారిలో స్మగ్లర్‌గా మారే హీరోగా కనిపిస్తాడు అమితాబ్. సినిమాలో నిజాయతీపరుడైన శశికపూర్ ఉన్నా అందలానికి ఎదిగిన అమితాబ్‌ను ఆరాధిస్తాడు ప్రేక్షకుడు. ఈ వరుసలోనే వచ్చింది 'షోలే'. ఇక్కడ అత్యంత దుర్మార్గుడైన గబ్బర్ సింగ్‌ను సంహరించడానికి ఇద్దరు చిల్లర దొంగలను కాంట్రాక్ట్ మీద పట్టుకొస్తాడు ఊరి పెద్ద ఠాకూర్. చిల్లర దొంగల్లో వీరత్వం ఉండటం, కొంచెం మానవత్వం ఉండటంతో మేలు చేయని పోలీసుల కంటే కొద్దిగా కీడు చేసే చిల్లర దొంగలే నయం అనుకుంటారు రామ్‌గఢ్ వాసులు, తద్వారా ప్రేక్షకులు. ఆ విధంగా సకల సద్గుణ శోభితుడైన హీరోకు నూకలు చెల్లుతూ వచ్చి 'పుష్ప' వరకూ అతడు రూపాంతరం చెందాడు.

***

'షోలే' కథ అంతా రెండు లైన్లలో చెప్పొచ్చు. గొప్ప కథలు ఏవంటే కట్టె కొట్టె తెచ్చె అన్నట్టుగా చెప్పగలిగేవే. పోలీస్ ఆఫీసర్ ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ సింగ్ చంపేశాడు. ఆ ప్రాంతానికి పీడగా మారాడు. వాణ్ణి చంపడానికి ఠాకూర్ ఇద్దరు దొంగలను కిరాయికి తెచ్చాడు. అంతే కథ. ఈ కథను మూడున్నర గంటల పాటు 70 ఎం.ఎం స్క్రీన్ మీద దర్శకుడు, నటీనటులు, రచయితలు, కెమెరామేన్, సంగీత దర్శకుడు ఎలా చూపారనేదే అసలు సంగతి. వాళ్లు ఎలా చూపారంటే అలా మరెవరూ, మరెప్పుడూ చూపలేకపోయారు. అందుకే షోలే అంటే షోలే. ఇలాంటి సినిమాలు సర్పాల తలలపై మణుల వంటివి. రీమేక్‌లని ప్రయత్నిస్తే మణులు రాళ్లయిపోతాయి. లేదా పాము కాటు తప్పదు. అందుకే 'షోలే'ను మళ్లీ మళ్లీ ముస్తాబు చేసి వదిలారు తప్ప రీమేక్ అంటే జనం తుపాకులు తీశారు.

***

'షోలే' యాక్షన్ సినిమా అనుకుంటారు. ఫక్తు కుటుంబ కథా చిత్రం. కుటుంబమే దీనికి ఆధారం. ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ గాడు కాల్చి చంపాడు. కుటుంబం కోల్పోతే మనిషికి ఉండే బాధతో ప్రేక్షకుడు ఐడెంటిఫై అవుతాడు. ఆ రోజుల్లో మగవారి ఎర్లీ డెత్స్ వల్ల ప్రతి ఇంటా ఒక వితంతువు ఉండేది. జయభాదురి వేసిన రాధ పాత్రను ప్రేక్షకులు పోల్చుకున్నారు. భర్త పోయిన ఎన్నో ఏళ్లకు ఆమె 'జయ్' అనే అమితాబ్‌ను చూసి మళ్లీ అతనితో కుటుంబాన్ని నిర్మించుకోవచ్చేమో అని ఆశ పడుతుంది. ఆ ఆశ ప్రేక్షకులకు తెలుసు. ఆమెకో కుటుంబం ఏర్పడాలని వారూ అనుకుంటారు. జరగదు. జయ్ చనిపోతాడు. ప్రేక్షకులు అక్కడా కనెక్ట్ అవుతారు. ఏ తాడూ బొంగరం లేని వీరూ అను ధర్మేంద్ర టాంగేవాలీతో సరసం చేసి సాధించుకుంది మౌసీతో పాటు ఒక కుటుంబాన్నే కదా! ఇక కథలో ఇమామ్ గారి కుటుంబానికి వచ్చిన బాధ ఎవరు మరుస్తారు. చేతికి ఎదిగొచ్చిన కొడుకు పట్నం పోయి సంపాదిస్తాడనుకుంటే తండ్రిని ఏకాకిని చేసి గబ్బర్ చేతుల్లో ప్రాణాలు కోల్పోతాడు. కుటుంబం ఉనికే భారతదేశ సమాజపు ఉనికి. ఇన్ని కుటుంబాల ఉద్వేగాల అల్లిక కాబట్టే 'షోలే' ఆడింది. ఆడుకుంది.

***

'షోలే' ప్రివ్యూ కోసం థియేటర్‌లో కూచున్న రాజ్‌కపూర్ సినిమా మొదలైన పది నిమిషాల్లోనే మొదలయ్యే ట్రైన్ రాబరీ సీక్వెన్స్ చూసి చకితుడయ్యాడు. 'ఇదేంటి... క్లయిమాక్స్‌ను ముందే పెట్టేశారు' అన్నాడట పక్కనున్న వారితో. అవును 'షోలే' క్లయిమాక్స్ ముందే వచ్చేస్తుంది... అంత భారీగా. ఆ తర్వాత 'షోలే'ను కేవలం సన్నివేశాల బలం మీద నడుపుతారుగాని యాక్షన్ మీద కాదు. 'షోలే' క్లయిమాక్స్ కేవలం ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మీదే! చేతుల్లేని ఠాకూర్ చేతులు తెగ్గొట్టే గబ్బర్‌తో తలపడతాడు. ఇలా స్క్రీన్‌ప్లే రాసిన 'షోలే' ఆడిందంటే ఏమిటి మర్మం! అదే మిటో ఎవరూ చెప్పలేరు. చెప్పినా కొంతే. రొంతే. అంతంతే. షోలేకు వ్యాఖ్యానం లేదు.

***

1973లో మొదలెట్టి రెండేళ్ల పాటు తీశారు 'షోలే'. కార్పెట్లు అమ్మి, ఆ తర్వాత రియల్ ఎస్టేట్ చేసి సంపాదించిన డబ్బును కొడుక్కు ఇచ్చి సినిమా చేయమన్నాడు నిర్మాత జి.పి.సిప్పీ. కోటి రూపాయల సినిమా! వస్తే చాలా డబ్బులు రావాలి పోతే కోటి అన్నాడు. అందుకు తగ్గ కథ రమేష్ సిప్పీ రాయించుకున్నాడు సలీమ్ జావేద్‌లతో! అతని వేడి చూసి - వాళ్లు కూడా రంగంలో దిగారు. 'లోహా గరమ్ హై... మార్ దో హథోడా' (ఇనుము వేడి మీద ఉన్నప్పుడే సమ్మెట పోటు పడాలి) అనుకున్నారు. ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మధ్య ఇద్దరు దొంగలను ప్రవేశపెట్టి కథ అల్లారు. దీనికి ప్రేరణ అకిరా కురసావా 'సెవన్ సమురాయ్', మనం తీసిన 'మేరా గావ్ మేరా దేశ్'... ఇంకొన్ని సినిమాలు ఉన్నాయి. అన్నీ తీసుకుని మనది ఇవ్వడం కూడా విద్యే. ఆ విద్యతో తయారైన ఈ కథకు ద్వారకా దివేచా కెమెరా, రామ్ యెదేకర్ ఆర్ట్ డైరెక్షన్, ఎం.ఎస్.షిండే ఎడిటింగ్, ఆర్.డి.బర్మన్ సంగీతం... గంధపు చేతులకు మల్లెలు చుట్టాయి. మరి రమేష్ సిప్పీ ఇంత మంచి టేకింగ్‌ను ఎలా సాధించాడో అతనికే తెలియాలి.

ధర్మేంద్ర, అమితాబ్, అంజాద్ ఖాన్, సంజీవ్ కుమార్, హేమమాలిని, జయభాదురి... ఎవరికి ఎవరు తక్కువ. సత్తువ చూపడం వారికి మక్కువ.

***

'షోలే'లో ప్రతి సన్నివేశానికి, ప్రతి ఫ్రేమ్‌కు అభిమానులున్నారు. అందులోని ప్రతి చిన్న పాత్రకూ అభిమానులున్నారు. జైల్లో గూఢచారిగా పని చేసే బార్బర్ హరిరామ్, పిరిమిగా కట్టెలు అమ్మే సూర్మా భూపాలి, నమక్ తినే కాలియా, గబ్బర్‌కు బదులు పలికే సాంబా, హిట్లర్ జైలర్, ఠాకూర్ నమ్మినబంటు రామ్‌లాల్, పిల్లనిచ్చేందుకు ధర్మేంద్ర గుణగణాలు ఆరాతీసే మౌసీ, 'మెహబూబా' పాటలో మెరిసిన జలాల్ ఆగా... ప్రతి ఒక్కరూ... సినిమాను ధన్యం చేశారు... ధన్యులయ్యారు. ప్రేమ నాటకం కోసం వాటర్ ట్యాంకర్ ఎక్కిన ధర్మేంద్ర 'చక్కీ పీసింగ్' (తిరగలి తిప్పింగ్) అంటాడు. ప్రేక్షకులు నవ్వుతారు. 'సూసైడ్' అంటే ఆత్మహత్య అని ధర్మేంద్ర వల్లే జనానికి ఇంగ్లిష్‌లో తెలిసింది.

> పంచ్ డైలాగ్స్ ఫలానా దర్శకుడు వచ్చాక, ఫలానా రచయిత వచ్చాక ట్రెండ్‌లోకి వచ్చాయి అని ఎవరైనా అంటే నోటితోనే నవ్వుబుద్ధవుతుంది. సకల పంచ్ డైలాగ్‌లకు బాప్ 'షోలే'. అందులో ప్రతి మాటా ఒక పంచ్ డైలాగే. పైగా అవి నిత్య జీవితంలోకి వచ్చేసిన డైలాగులు. కొటేషన్‌లు. సూక్తులు.
>
> ● ఇజ్జత్ కీ మౌత్ జిల్లత్ కీ జిందగీ సే కయీ అఛ్ఛీ హై (పరాభవాలతో బతికే కన్నా పరువుతో చావడం మేలు)
> ● ముఝేతో సబ్ పోలీస్ వాలోంకీ సూరతే ఏక్ జైసీ లగ్ తీ హై (నాకు అందరు పోలీసోళ్ల ముఖం ఒకలాగే కనిపిస్తుంది)
> ● తేరా క్యా హోగా కాలియా (నీ గతేంది కాలియా)
> ● తుమ్హారా నామ్ క్యా హై బసంతి? (నీ పేరేంటి బసంతి)
> ● దామ్ జో తుమ్ చాహో... ఔర్ కామ్ జో మై చాహూ (సొమ్ము మీరు కోరినంత... పని నేను చెప్పినంత)

***

'షోలే' తన శబ్దాలతో కూడా మనకు కనెక్ట్ అవుతుంది. రైలు కూతా, గుర్రపు డెక్కల చప్పుడు, జట్కా మువ్వలు, అజాన్, దూది ఏకే కమాను, కమ్మరి మోత... ఇక ఈ సినిమాకు ముందు రివాల్వరు, రైఫిలు పేలితే అలాంటి సౌండ్ వస్తుందని ప్రేక్షకులకు తెలియదు. బ్రిటిష్ స్టంట్‌మెన్ ఈ సినిమాకు స్టంట్ కొరియోగ్రాఫర్లుగా పని చేశారు. ట్రైన్ రాబరీలో ఒక బుల్లెట్ తగిలి గూడ్సు పెట్టెకు అంటించిన సర్కారు కాగితం చిట్లుతుంది. అలాంటి ఒక్క షాటు తర్వాతి కాలంలో తీయలేకపోయారు.

***

'షోలే' గొప్పతనం తెల్లార్లు చెప్పుకోవాలి. గబ్బర్ సింగ్ పేరు వాడుకుని ఒక హిట్ సినిమా తీసుకున్న మనం 'షోలే' యాభై ఏళ్ల సందర్భంగా ఉత్సవం తప్పక చేసుకోవాలి. ఈ సినిమాను తిరగేసి గుహనాథన్ కథ చెప్తే బాగుందని రామానాయుడు గారు 'కక్ష' తీశారు. ఇందులోని కొన్ని సీన్లు దర్శకేంద్రుడి 'అడవి రాముడు'కు పనికి వచ్చాయి. 'షోలే' ఎందరినో డైరెక్టర్లు అయ్యేలా చేసింది.

రైలుతో మొదలయ్యి రైలుతో ముగిసే ఈ సినిమా భారతీయ ప్రేక్షకులతో యాభై ఏళ్ల ప్రయాణం చేసింది. ఇంకో యాభై ఏళ్లు ఇకపై చేస్తుంది.

ఏ దోస్తీ హమ్ నహీ తోడెంగే
తోడెంగే దమ్ మగర్ తేరా సాథ్ న ఛోడెంగె...
న ఛోడెంగె...

- కె.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఆగస్టు 14న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,01,310	1,03,050	1,01,350	1,03,050	1,00,950	1,01,340
బంగారం (22 క్యారెట్లు)	94,670	92,900	92,900	95,690	92,870	92,900
వెండి	1,18,300	1,18,700	1,26,000	1,18,700	1,17,700	1,27,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.